# మెరుపు

మిట్టమధ్యాహ్నమయినా హేమంత శీతలచ్ఛాయ జగతిని ఆచ్ఛాదించేవుంది.

"మేడమ్" శ్రుతి ఛాంబర్‌లోకి ఆదుర్దాగా ప్రవేశించాడో యువకుడు. అతని కళ్ళల్లో బెదురు! ముఖంమీద చిరుచెమటలు!

"యస్" అంటూ తలెత్తిన శ్రుతి జీవన్‌ని చూసి పలకరింపుగా చిరునవ్వు నవ్వింది.

"మేడమ్! నేను ఏక్సిడెంట్ చేశాను. నా స్కూటర్ క్రింద ఒక కుర్రాడు పడ్డాడు." ఏడుపు గొంతుకతో చెప్పాడు జీవన్.

"ప్రమాదమైన దెబ్బలేం తగల్లేదు కద!" అప్రయత్నంగా కుర్చీలో నుంచి లేస్తూ ఆత్రుతతో అడిగింది శ్రుతి.

"స్పృహలోనే వున్నాడు కాని, తలకు, కాళ్ళకు దెబ్బలు తగిలాయి. తల నుండి విపరీతంగా రక్తం కారిపోతూంది. జీవన్ చెప్తూ వుండగానే రిక్షాఅతను పది, పన్నెండేళ్ళ వయసున్న కుర్రాడిని చేతులమీద తీసుకొచ్చి పరీక్ష గదిలో పడుకోబెట్టాడు. కుర్రాడి ముఖం, బట్టలు రక్తంతో తడిసిపోతున్నాయి.

"మేడమ్! మీరే నన్నీగండం నుంచి ఎలాగైనా తప్పించాలి. ఆ కుర్రాడిని జనరల్ హాస్పటల్‌కు తీసుకువెళ్తే పోలీస్ కేస్ అవుతుంది. ఒకసారి పోలీసుల చేతిలో పడితే ఎన్ని తంటాలు పడాలో మీకు తెలిసిందే కదా! మీరిలాంటి కేసుల్ని ట్రీట్ చెయ్యరని నాకు తెలుసు. ఐనా నామీద దయతలచి అతన్నెలాగైనా బ్రతికించండి. ఏ డాక్టరు అవసరమయితే ఆ డాక్టర్ని పిలిపించండి. డబ్బెంతైనా ఫరవాలేదు". ఒక్కసారి అంత రక్తాన్ని చూచి బెదిరిపోయిన జీవన్ లోగొంతుతో శ్రుతిని ప్రాధేయపడ్డాడు. "కంగారు పడకండి. ముందతన్ని చూశాక ఇక్కడ వుంచి ట్రీట్ చెయ్యగలమో లేదో చెప్తాను." జీవన్‌కి ధైర్యం చెప్పి పరీక్ష గదిలోకి వెళ్ళింది శ్రుతి. అప్పటికే నర్స్ గాయాల దగ్గర శుభ్రం చేస్తూంది. శ్రుతి స్పర్శతో కళ్ళు విప్పాడతను.

"నీ పేరేంటి బాబూ?!" ఓదార్పుగా తన చేతిని పట్టుకున్న శ్రుతి వంక బేలగా చూశాడతను.

"వేణు. వేణుగోపాల్" అస్పష్టంగా చెప్పాడు. దెబ్బతో కలిగిన షాక్, ధారలుగా కారిన రక్తాన్ని, క్షణాల్లో వాచిపోయి, అమితమైన బాధ పెడుతున్న కుడి కాలును చూసిన భయం అతని కళ్ళల్లో కదలాడుతున్నాయి. అంతకంటే ఎక్కువగా రేపటి నుండి తను పనిలోకి వెళ్ళలేకపోతే?!... అన్న బ్రతుకుభయం వేణు హృదయాన్ని నులుముతోంది.

"ఎలా దెబ్బతగిలింది వేణూ!" గాయాల్ని పరిశీలిస్తూ నొప్పి తెలియకుండా ఉండడానికి అతడ్ని మాటల్లో పెట్టడానికి ప్రయత్నిస్తూంది శ్రుతి. ఆమె ప్రశ్నతో పూర్తిగా తెలివిలోకి రావడానికి ప్రయత్నించాడు వేణు.

"నాకు ఎన్నాళ్ళనుండో సైకిల్‌మీద రయ్యిన వెళ్ళాలని కోరిక. మా ఓనరు బజార్లోకెళ్ళి అరటిపళ్ళు తెమ్మంటే ఆయన చూడకుండా దొడ్లోవున్న సైకిలెక్కి బయల్దేరాను. పెడల్స్ సరిగ్గా అందక బాలెన్స్‌ను ఆపుకోలేక ఈయన స్కూటర్‌కి అడ్డెళ్ళి పడ్డాను" తలమీద లోతుగా వున్న

గాయం చుట్టూ వున్న వెం(ట్రుకల్ని నర్స్ కత్తిరిస్తూంటే ఓర్చుకుంటూ జవాబిచ్చాడు వేణు.

"ఆయన స్పీడ్‌గా వెళ్తూ నిన్ను పడేశానని చెప్తున్నాడే?!" కుట్లు వేస్తూ అడిగింది(శుతి.

"కాదమ్మగారూ! నేనే ఆయన స్కూటర్‌కి అడ్డెళ్ళాను. ఆయనదేం తప్పులేదు" నిశ్చలంగా చెప్తున్న అతని వంక ఆశ్చర్యంగా చూసింది (శుతి. తప్పు తనదే అని ఖచ్చితంగా అందరికీ తెలుస్తున్నా ఎదుటివాడిమీదకు నెపాన్ని నెట్టేసి బుకాయించే వాళ్ళనే సామాన్యంగా చూసే (శుతికి తప్పు తనదే అని స్పష్టంగా ఒప్పుకుంటున్న వేణు అపురూపంగా కనబడ్డాడు. "ఆయన తిడతారని నేను బయపడుతూంటే ఆయనే నన్ను భుజానేసుకుని రిక్షా దొరికే దాకా మోసుకుని తీసుకొచ్చారు". కొట్టేసి పారిపోయే చాలామందిలా కాక జీవన్ వేణును తీసుకొచ్చి (ట్రీట్ చేయిస్తున్నందుకు సంతోషించింది (శుతి.

కాలికి, తలకు ఎక్స్-రే తీయించాలని చెప్పగానే, (ప్రక్కవీధిలో ఉన్న ఎక్స్-రే క్లినిక్‌కు వేణును తీసుకెళ్ళి ఎక్స్-రేలు తీయించుకుని వచ్చాడు జీవన్. ఎక్స్-రేల్ని చూసాక మెదడుకు దెబ్బ తగిలిన సూచనలు కనపడడం లేదని, కుడికాలి ఎముక విరిగిందని, న్యూరోసర్జన్‌కి ఒకసారి చూపించి, ఆర్థోపెడిక్ సర్జన్‌తో కాలికి కట్టు వేయిస్తానని చెప్పింది (శుతి. వేణుకు తక్షణ (ప్రాణాపాయం ఏమీ లేదని తేలాక అప్పుడతని తల్లి దం(డులకీ విషయం తెలియజెయ్యాలనే విషయం గుర్తుకొచ్చింది. తల్లిదం(డుల విషయం అడగ గానే వేణు ముఖం ఇంకా వాడిపోయింది.

"మా నాన్న నా చిన్నప్పుడే చనిపోయారు. మా అమ్మ పన్లోకి వెళ్ళింది". తనకు దెబ్బ తగిలిన విషయం అమ్మకు తెలిస్తే ఎంత తల్లడిల్లిపోతుందో గుర్తుకొచ్చి కలవర పడ్డాడు వేణు.

"మరెలా?" వేణు బాధ్యతను స్వీకరించే వ్యక్తులెవరూ లేకుండా, వారి అనుమతి లేకుండా తన బాధ్యతతో అతనికి చికిత్స చేయించడానికి తటపటాయించింది (శుతి.

"మా ఇంటి దగ్గరి వాళ్ళకెవరికైనా చెప్తే మా అమ్మను తీసుకొస్తారు" వేణు చెప్పింది విని జీవన్ ఆలోచనలో పడ్డాడు. తను అర్జంట్‌గా ఆఫీసుకు వెళ్ళిపోవాలి. ఇప్పటికే చాలా ఆలస్యమయింది. ఈ కు(రాడి తాలూకు వాళ్ళంతా చేరితే వాళ్ళను తను ఎదుర్కోలేడు. వాళ్ళు తనదే తప్పని తూలనాడతారు. తన దగ్గర సాధ్యమైనంత ఎక్కువ డబ్బు లాగడానికి (ప్రయత్నిస్తారు. తన మెడమీద పోలీసుకేసు అనే కత్తిని పెట్టి ఎన్నివేలిమ్మని డిమాండ్ చేస్తారో! తన కసలే ఒణుకుగా ఉంది. తన ఆఫీసులో కొలీగ్స్‌కి ఫోన్‌చేసి రమ్మంటేనో!.. అదే నయం. వాళ్లయితే కొంచెం డబయింపుగా మాట్లాడతారు. తన ముఖం చూస్తే వీళ్ళు మరీ లోకువగట్టి మాట్లాడతారు.

"కబురు చెయ్యడానికి ఎవరూ లేరు. కాంపౌండర్స్ ఇంటికి వెళ్ళిపోయారు. ఆర్థోపెడిక్

సర్జన్ వచ్చేలోగా వేణు వాళ్లమ్మగారు వస్తే బావుంటుంది''. శ్రుతి భావాన్ని అర్థం చేసుకున్న జీవన్ అప్పటివరకు తన మనసులో మెదిలిన ఆలోచనల్ని ప్రక్కకు నెట్టి వేణు తల్లిని పిలుచుకు రావడానికి సంసిద్ధుడయ్యాడు. తను ఆమెను పిలుచుకుని వస్తే వేణుకు ట్రీట్‌మెంట్ మొదలుపెట్టడంలో జాప్యం జరగదనే వాస్తవమొక్కటే అతని మనసులోవుంది.

''నేనావిడను తీసుకువస్తాను మేడమ్!'' అంటూనే బయటకు వడివడిగా వెళ్తున్న అతని వంక ప్రశంసగా చూసింది శ్రుతి. ఏక్సిడెంట్ చేసి దెబ్బతగిలిన వాళ్లను వాళ్ళ ఖర్మానికి వాళ్ళను వదిలేసి పారిపోవడమో, లేక హాస్పిటల్‌కి తీసుకొచ్చినప్పటికి వాళ్లకు ట్రీట్‌మెంట్‌కోసం కొంచెం డబ్బు పారేసో, వీలు చిక్కితే అదీ ఇవ్వకుండానో ఉడాయించేసే ప్రబుద్ధుల్నే ఎక్కువగా చూసే శ్రుతికి జీవన్ ఇంతటి నిజాయితీతో బాధ్యత తీసుకోవడం అబ్బుర మనిపించింది.

కాసేపట్లోనే జీవన్ ఆఫీస్ కొలీగ్స్ ముగ్గురు వచ్చారు. వేణు చుట్టాలొక ఐదుగురు వచ్చారు. రావడం రావడమే జీవన్‌పై కత్తులు దూస్తూ వచ్చారు. వేణు తల్లికి కబురుచేసి ఆవిడ వచ్చేలోగానే వేణుకు తగిలిన దెబ్బల్ని చూసి అగ్గగ్గలాడిపోతూ నానా హడావిడి చేశారు. ''వీడు రేపు పన్లోకి వెళ్ళకపోతే వాళ్ళమ్మ ఒక్కతే సంపాదించి తెచ్చేదాంతో వాళ్ళ కడుపులు నిండవు. వీడి తరువాత వాళ్ళిద్దరూ రెక్కలు రాని పక్షులు. ఇప్పుడు కాలికి కట్టు వేశారంటే మూడు నెల్లదాకా వీడు వీధిలోకి రావడానికి వీలుండదు. అంచేత మీరు కూడా కొంచెం ఆలోచించండి''. చల్లగా బేరం మొదలుపెట్టారు వేణు బంధువులు. నొప్పి తెలవకుండా చేసిన ఇంజక్షన్ ప్రభావంతో మాగన్నుగా నిద్రిస్తున్నాడు వేణు. జీవన్, అతని స్నేహితులు గుసగుసగా సంప్రదించుకుని తమ బేరం చెప్పారు.

'డాక్టర్ల ఫీజులు, మందులు, కట్లు వేయడానికి ఎంత ఖర్చు!! ఇంతా పెట్టుకుని ఇంకా నెలల తరబడి ఇల్లు గడవడానికి కూడా ఇవ్వమంటే డబ్బు కట్టలిసరడానికి వీడేమీ లక్షాధికారి కాదు. మామూలు గుమాస్తా. మీరూ ఆలోచించండి మరి'.

ఇరు వర్గాల వారికి వాదులాట జరుగుతూ ఉండగా జీవన్ శ్రుతి దగ్గరకు వచ్చాడు.

''మేడమ్! వాళ్ళగొంతెమ్మ కోర్కెల్ని తీర్చగల శక్తి లేదు నాకు. దయచేసి మీరు కొంచెం కలగజేసుకుని వాళ్ళను ఒప్పించండి. నేను స్కూటర్ని స్పీడ్‌గా నడిపి ఏక్సిడెంట్ చెయ్యడం తప్పే! ఒప్పుకుంటున్నాను కాని...'' అంతలో శ్రుతిఫోన్‌ని అందుకున్న న్యూరోసర్జన్, ఆర్థోపెడిక్ సర్జన్ వచ్చారు. న్యూరో సర్జన్ మెదడుకు సంబంధించిన సమస్యేమీ లేదని నిర్ధారించి వెళ్ళాడు. ఆర్థోపెడిక్ సర్జన్ జనరల్ ఎనస్థీషియా ఇచ్చి విరిగిన ఎముకను సరిచేసి కట్టు వెయ్యాలని చెప్పాడు.

కట్టు వెయ్యడానికి సిద్ధంచేస్తూ ఎనస్థటిస్ట్ కోసం నిరీక్షిస్తూ వుంగా వేణుతల్లి కొడుకుకు

దెబ్బ తగిలిందని తెలిసి పరుగు పరుగున వచ్చింది. అమ్మ స్పర్శ తగలగానే కళ్ళు విప్పి తల్లిని అల్లుకుపోయిన బిడ్డను అక్కున చేర్చుకుని కన్నీళ్ళు కార్చిందామె.

'నాన్నా! ఇన్ని దెబ్బలు తగిలించుకున్నావు, నీకేమన్నా అయితే నేనెలా బ్రతకనురా?!' కొడుకును కౌగిలించుకుని ఏడుస్తూ వెలుతురేలేని తన బ్రతుకును తలచుకుంటూందామె.

"అమ్మా! ఏడవకమ్మా! ఇంకెప్పుడూ ఇట్లా చెయ్యను. నీమీదొట్టు". తల్లి తల మీద చెయ్యేసి వాగ్దానం చేసి ఆమె కన్నీళ్ళను తుడుస్తున్నాడు వేణు.

కొంచెందూరంలో ఇంకా కొనసాగుతున్న వాగ్వివాదాలు తల్లీ కొడుకుల చెవుల్లో పడుతూనే ఉన్నాయి.

"అమ్మా! ఆయనదేం తప్పులేదు. నేనే బాలెన్స్ ఆపుకోలేక పడ్డాను". తల్లితో రహస్యంగా చెప్పాడు వేణు.

"ఒరేయ్! నువ్వు నోర్మూయ్యరా. పెద్దాళ్ళేదో మాట్లాడుతున్నారు గదా!" వేణు పెద్దమ్మ కూతురు కసిరింది.

"కాని అన్యాయంగా మాట్లాడగూడదుగా!" నసిగాడు వేణు.

"సింగినాదం! అన్యాయమంట అన్యాయం!! న్యాయంగా అడిగితే ఎవడిస్తాడ్రా? రేపటినుంచి మీ అమ్మ ఎక్కడినుంచి తెచ్చి పెడుతుందిరా నీకు, నీ చెల్లెళ్ళకు తిండి?! చావుకు పెడితేనే కాని, లంఖణానికి రారు. నువ్వు నోర్మూసుకునుండు. నాన్న, అన్నయ్య సాధ్యమైనంత ఎక్కువ రాబడతారు". అందామె. వేణు విచారంగా మౌనం వహించాడు.

వేణుతల్లి దుర్గను చూడగానే గుర్తించింది శ్రుతి. ఆమె పురుళ్ళన్నీ తన దగ్గరే అయ్యాయి. శ్రుతి పలకరించగానే భర్తను తలచుకుని కన్నీళ్ళు పెట్టుకుంది దుర్గ.

కట్టువేశాక వేణును రూమ్‌లో పడుకోబెట్టారు. జీవన్ ఈ వ్యవహారన్నింతటితో వదిలించుకోవాలని తొందర పడుతున్నాడు. ఒకరినొకరు డబాయిస్తూ ఇరువర్గాలవారూ బెట్టుగావున్నారు. జీవన్ మళ్ళీ శ్రుతి దగ్గరచేరి ఎంతో కొంత స్వల్ప మొత్తం తీసుకోవడానికి వాళ్ళను ఒప్పించమని ప్రాధేయపడుతున్నాడు. అప్పటి వరకు కారుణ్యామూర్తిలా ప్రవర్తించిన జీవన్‌లోని మరో కోణాన్ని దర్శిస్తూంది శ్రుతి. అంతలో దుర్గ శ్రుతి దగ్గరకు వచ్చి అక్కడ జీవన్‌ని చూచి ఒకక్షణం తటపటాయించింది.

"అమ్మగారూ! దిక్కులేని బ్రతుకయిపోయింది మాది. మా ఆయన పోయిన దగ్గర్నుండి కటిక చీకట్లో తచ్చట్లాడుతూ బ్రతుకుతున్నాము. పుస్తకాలు పట్టుకోవలసిన పసి చేతుల్తో నా బిడ్డ మెకానిక్ షెడ్డులో మోటు పనులు చేసి సంపాదించి తెస్తే గాని మా బ్రతుకులు

వెళ్లమారడంలేదు. ఎవరికి వాళ్ళకే ఏ రోజుకారోజు బ్రతుకు వెతుకులాటగా వున్న బంధువులు మమ్మల్ని ఎన్నాళ్ళాదుకుంటారు? అందుకే కలోగంజో తాగుతూ మా పాట్లేవో మేము పడుతున్నాము". శోకదేవతలా వున్న దుర్గ చెప్తూంది విని జీవన్ ఆలోచనలో పడ్డాడు. ఇప్పుడీవిడ ఉపోద్ఘాతమంతా దేనికి?! ఈ ఆకలి అరుపులన్నీ ఖచ్చితంగా అప్పనంగా తన దగ్గర్నుంచి డబ్బు కొట్టేద్దామనే దురుద్దేశంతోనే! డబ్బాశ ఎన్ని నాటకాలనైనా వేయిస్తుంది. దరిద్రం ఎంత నీచానికైనా ఒడిగట్టేలా చేస్తుంది. ఇప్పుడీవిడ తన జాలి కథతో, బుడి బుడి దీర్ఘాలతో డాక్టరమ్మగారి మనసు కరిగిస్తుంది. ఈవిడ మాయమాటల్లో పడిపోయి మేడమ్ తనను వాళ్ళడిగినంత డబ్బు ఇవ్వమంటారో ఏమిటో! ఇందాక తనసలే నోరు జారాడు. పెద్ద గొప్పగా డబ్బెంతైనా ఖరవాలేదన్నాడు. ఇప్పుడది తన మెడకు చుట్టుకుంటుంది. ఎలా తప్పించుకోవడం?!... ఐనా తను డాక్టరమ్మగారి మాట విని తీరాలని రూలేమీ లేదుగదా?! ఆ కుర్రాడికెలాగూ ప్రాణ భయం లేదని నిర్ధారణ అయిందాయె. తనిప్పుడు జడవాల్సిన పనెంతమాత్రమూ లేదు. వాళ్ళ తాటాకుచప్పుళ్ళకు బెదరకుండా నిబ్బరంగా నిలబడగలడు.

"అమ్మగారూ! నా కొడుకు అవిటివాడు కాకుండా కాపాడండి" దుఃఖంతో పూడుకు పోయింది దుర్గ కంఠం. 'తను కోరుకోబోయేదానికి ఎంత చక్కటి పునాది వేస్తూందో మహాతల్లి' అనుకుంటూ ఆమె వంక కఠినంగా చూస్తున్న జీవన్ ఆమె చూపు తన వైపుకు తిరగగానే ముఖం తిప్పుకున్నాడు.

"బాబుగారూ! మిమ్మల్నిలా అడగడం ఇష్టం లేదు నాకు. కాని డబ్బులేని నేను నా ఇష్టాల ప్రకారం బ్రతకలేనని నాకు తెలుసు బాబూ! వాడి కాలికి నయమయేదాకా ఏ బాధొచ్చినా అమ్మగారు చూసేలాగా ఏర్పాటు చేసి వెళ్ళండి చాలు. నా చేతికేమీ డబ్బివ్వొద్దు మీరు". తన గుండెమీద నుండి కొండంత భారం దిగిపోయినట్లుగా ఒక క్షణం ఊపిరి పీల్చుకున్న జీవన్‌కి అప్పటివరకు తన మనసులో మెదిలిన ఆలోచనలు గుర్తుకొచ్చి సిగ్గుతో చితికిపోతున్నాడు.

"పేదరాలి కోపమే కాదు, ఆత్మాభిమానం కూడా చేటు అనే సత్యం నాకు అనుభవమయింది బాబూ! అందుకే నోరు తెరిచి అడుగుతున్నాను. నా బిడ్డ అవిటివాడు కాకుండా చూడండి. అంతే చాలు" భోరున విలపించసాగిందామె.

ఆమె కన్నీళ్ళు జీవన్ మనసులోకి ప్రవేశించాలని ప్రయత్నించిన మాలిన్యాన్ని ఒక్క ఉదుటున బయటకు తోసేశాయి. అప్రయత్నంగా దుర్గ చేతినందుకున్న జీవన్ మాటలకందని ఆత్మీయతను, భరోసాను మౌనంతో అందిస్తున్నాడు.